ప్రజాశక్తి

బుధవారం 3 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేడు విశాఖకు సిఎం

◆ అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

◆ పటిష్ట ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

◆1300 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రి రజని

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ, మధురవాడ

రాష్ట్ర ప్రభుత్వం మధురవాడ ఐటి హిల్ నెంబర్ 4లో 130 ఎకరాలను అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన నేపథ్యంలో శంకుస్థాపన నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖకు రానున్నారు. మధ్యాహ్నం నేరుగా ఆయన హిల్‌పై ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. బుధవారమంతా సిఎం విజయనగరం, విశాఖపట్నంల్లో బిజీబిజీగా గడపనున్నారు. తొలుత ఆయన విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం హిల్ నెంబర్ 4కు విచ్చేస్తారు. ఇక్కడ జరిగే డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ పాల్గొంటారని సమాచారం. మరోవైపు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలూ బుధవారం జరిగే రాస్తారోకోల్లో పాల్గొననుండటంతో రాజకీయంగానూ సిఎం విశాఖ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న హై టెన్షన్ నెలకొంది. ఈ క్రమంలో పోలీస్, ఇంటెలిజెన్స్ వర్గాలు, అధికార యంత్రాంగం అప్రమత్తమై పరిస్థితులపై నివేదికలు తెప్పించుకున్నాయి. విశాఖలో 1300 మందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు మిగతా 2లో..

అదానీకి లాభం చేకూర్చేందుకే ఐలా ఏర్పాటు

జివిఎంసికి తీవ్ర నష్టం ◆ సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

కలెక్టరేట్ : నిబంధనలన్నింటినీ బుల్డోజ్ చేసి అదానీకి భారీగా లాభాలను పోగేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)ను ఏర్పాటు చేసిందని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ చర్య పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. దీనివల్ల మహా విశాఖ నగరపాలక సంస్థ వివిధ పన్నులు, ఛార్జీలు, రుసుముల ద్వారా అదానీ స్థాపించబోయే సంస్థల నుంచి వచ్చే ఆదాయాన్ని భారీగా కోల్పోనుందన్నారు. అడ్డగోలుగా అదానీకి రాష్ట్ర ప్రభుత్వం దోచిపెట్టే చర్యలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. విశాఖలోని రుషికొండ దగ్గరలో మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌పై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎలాగైనా ప్రైవేటీకరించి తీరుతామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెగేసి చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు నేటికీ 809 రోజులుగా ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే సహించేదిలేదని దీక్షలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అధికార పార్టీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నాయకులు వైవి.సుబ్బారెడ్డి తదితరులు కూడా దీక్షలకు మద్దతు తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని చేతులు దులుపుకొని వదిలివేయడం అంటే రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుందని లోకనాథం పేర్కొన్నారు. మధురవాడ మిగతా 2లో..

ఉక్కు రక్షణకు నేడు రాస్తారోకోలు

జయప్రదం చేయాలని వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం బుధవారం జరగనున్న రాస్తారోకోలను ఎక్కడికక్కడ జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజులు మంగళవారం సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లకు పైబడి ఉద్యమం జరుగుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన కుట్రలను ఆపలేదని తెలిపారు. ఏదో విధంగా ప్లాంటును బలహీనపరిచి తన అనుయాయులైన కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ జరిగే రాస్తాకోలను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ మిగతా 2లో..

అకాలవర్షంతో 'చి'వరి' పాట్లు

▶ వార్త 5లో..

పథకం ప్రకారమే రంగురాళ్ల దోపిడీ

▶ వార్త 8లో..

సమస్యలపై ఆశా వర్కర్ల నిరసనలు

▶ వార్త 5లో..

క్లాప్ డ్రైవర్ల సమస్యలపై త్వరలో సమ్మె

మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే సమ్మెకు వెళ్లనున్నట్లు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు వివక్షత లేకుండా జిఒ 7 ప్రకారం రూ.18500 వేతనం చెల్లించకుండా జివిఎంసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కేవలం రూ.12500 మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. మధ్యవర్తులు, కాంట్రాక్టర్ల దోపిడీ లేకుండా ఆప్కాస్‌ను తీసుకువస్తూ జిఒ 136ను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. దీని ప్రకారం ఆప్కాస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లిస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న ఆప్కాస్ డ్రైవర్లు చేస్తున్న పనినే క్లాప్ డ్రైవర్లు కూడా చేస్తున్నారని తెలిపారు. ఒకే సంస్థలు ఒకే పనిని ఒకే విధంగా చేస్తున్నప్పుడు ఆప్కాస్ డ్రైవర్లకు ఒక విధంగా, క్లాప్ డ్రైవర్లకు మరో విధంగా వేతనాలు చెల్లించడం వివక్షత కాదా ? అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఎక్కడా లేనివిధంగా జివిఎంసిలో క్లాప్ డ్రైవర్ల పనిని కాంట్రాక్టుకు ఇచ్చారని చెప్పారు. ఆ కాంట్రాక్టర్ ముఖ్యమంత్రి జగన్‌కు బంధువు కావడంతో జిఒను సక్రమంగా మిగతా 2లో..

నిలకడలేని ఆదాయం

◆ జమకాని 15వ ఆర్థిక సంఘం నిధులు

◆ తలసరి గ్రాంట్‌లో హెచ్చుతగ్గులు

◆ సర్‌ఛార్జ్ డబ్బులూ అంతే... ◆ నిధుల్లేక ఆచితూచి జెడ్‌పి అడుగులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రిజిస్ట్రేషన్లు తగ్గడంతో జిల్లా పరిషత్ ఆదాయంపై ఆ ప్రభావం పడింది. ప్రభుత్వం నుంచి నిధులు సరిగా రాకపోవడంతో అభివృద్ధి పనులు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు నిధులు వెచ్చించలేని పరిస్థితి నెలకొంది. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం ఇచ్చే తలసరి గ్రాంట్, సీనరేజ్ పన్ను కింద రావాల్సిన ఆదాయం, స్టాంప్‌డ్యూటీపై వచ్చే సర్‌ఛార్జ్, జెడ్‌పి షాపుల అద్దె ద్వారా వచ్చే ఆదాయంలో స్థిరత్వం కరువైంది. ఇవే జెడ్‌పికి ప్రధాన ఆదాయ వనరులు. వీటి ద్వారా వచ్చే ఆదాయం తగ్గడంతో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొంది.

జిల్లా పరిషత్‌కు తలసరి గ్రాంట్ కింద 2014-15లో రూ.57,59,400 జమకాగా, 2015-16, 2016-17, 2017-18లో రూ.83,52,400 చొప్పున వచ్చాయి. 2018-19, 2019-20లో రూ.78,25,200, 2020-2021, 2022-23లో రూ.92,15,500 చొప్పున నిధులొచ్చాయి. 2021-22లో రూ.69,11,640 జమయ్యాయి. ఈ సంవత్సరంలో జిల్లా పరిషత్‌కు రూ.23 లక్షల ఆదాయం తగ్గింది. 2014-15 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో అత్యధికంగా గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.6.67 కోట్ల ఆదాయం సీనరేజ్ కింద వచ్చింది. సర్‌ఛార్జ్ కింద 2022-23లో రూ.6.48 లక్షల ఆదాయం వచ్చింది. 2020-21లో రూ.7.09 కోట్లు, 2021-22లో రూ.7.73 కోట్లు సర్‌ఛార్జ్ కింద జమైంది. గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లు ముందుటేడాది లేకపోవడంతో స్టాంప్ డ్యూటీ కింద రావాల్సిన సర్‌ఛార్జ్ పెరగలేదు. 2018-19లో సర్‌ఛార్జ్ కింద నిధులు జమకాలేదు. రిజిస్ట్రేషన్లలో పెరుగదల లేకపోవడంతో జిల్లా పరిషత్‌కు రావాల్సిన ఆదాయం కోటి రూపాయలకుపైగా తగ్గింది.

ఆర్థిక సంఘం నిధులు ఏవీ ..

15వ ఆర్థిక సంఘం నిధులు 2022-23లో పైసా కూడా జమకాలేదు. 2021-22లో రూ.10.49 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం 2022-23లో నిధులు ఇవ్వలేదు. వివిధ పద్దుల కింద వచ్చిన సాధారణ నిధులను అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నామని జిల్లా పరిషత్ అధికారులు చెబుతున్నారు. జిల్లా పరిషత్ సాధారణ నిధులు పుష్కలంగా లేకపోవడంతో జెడ్‌పిటిసి సభ్యుల ప్రతిపాదిత పనులకు, రక్షిత మంచినీటి పథకాల మిగతా 2లో..

క్లాప్ డ్రైవర్ల సమస్యలపై త్వరలో సమ్మె

(మొదటి పేజీ తరువాయి..) అమలు చేయడం లేదన్నారు. వేతనాలు తగ్గించి ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా క్లాప్ డ్రైవర్లను ఆప్కాస్‌లోకి తీసుకువచ్చి జిఒ 136 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ నగరానికి బుధవారం వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దీనిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని, లేకుంటే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నెల 3న పిఎఫ్, ఇఎస్ఐ కార్యాలయాల ఎదుట, 4న జెసిఎల్ కార్యాలయం, 5న జివిఎంసి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. 6న బైక్ ర్యాలీ, 7న క్లాప్ డ్రైవర్ల కుటుంబ సభ్యులతో జివిఎంసి కార్యాలయం వద్ద భారీ ధర్నా ఉంటాయన్నారు. అప్పటికీ అధికారులు దిగి రాకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. అవసరమనుకుంటే జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్లందరినీ సమ్మెలో భాగస్వాములను చేస్తామని స్పష్టం చేశారు.

ఉక్కు రక్షణకు నేడు రాస్తారోకోలు

(మొదటి పేజీ తరువాయి..) (న్యూ డెమోక్రసీ), ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ తదితర వామపక్ష పార్టీలు కూడా బంద్‌లో పాల్గొంటున్నాయని తెలిపారు.

ఉక్కునగరం : బుధవారం జరిగే రాస్తారోకోలను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోటేశ్వరరావు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 810వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ 1 కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. ఎఐటియుసి నాయకులు కె.రాజబాబు, డి.వి.నాగబాబు, వెంకటేష్, సిఐటియు నాయకులు బి.అప్పారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : రాస్తారోకోలను ప్రజలు జయప్రదం చేయాలని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు పిలుపునిచ్చారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన ఉక్కు దీక్షలు మంగళవారానికి 761వ రోజుకు చేరాయి. శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దీక్షల్లో జగదాంబ జోన్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్రను తమ ప్రభుత్వ హయాంలో ఉత్తమాంధ్రగా తీర్చుదిద్దుతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామాయపట్నం పోర్టుకు, భోగాపురం ఎయిర్ పోర్టుకు తానే శంకుస్థాపన చేశానని డబ్బాలు కొట్టుకుంటున్న చంద్రబాబు ఇకనైనా అసత్యాలు మానుకోవాలని హితవు పలికారు. 14 ఏళ్లలో ఉత్తరాంధ్రకు ఏ మేలూ చేయని చంద్రబాబు నేడు జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు.

మొదటి పేజీ తరువాయి..

నేడు విశాఖకు సిఎం

చేశారు. సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పరిశీలించారు. ఆమె వెంట టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, ఐటి శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐటి, పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు ఉన్నారు. అలాగే మధురవాడ హిల్ రోడ్లను, వేదికను, భూమి పూజ ఏర్పాట్లను జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

అదానీకి లాభం చేకూర్చేందుకే ఐలా ఏర్పాటు

ఐటి హిల్ నెంబర్ 4లో రాష్ట్ర ప్రభుత్వం అదానీకి డేటా సెంటర్, 200 మెగావాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం పేర సుమారు 130 ఎకరాలు కేటాయించిందని, దాదాపు 4 వేల కోట్ల విలువ కలిగిన భూమిని కేవలం రూ.130 కోట్లకే ధారాదత్తం చేయడం దారుణమని పేర్కొన్నారు. అదానీ డేటా సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం శంకుస్థాపన చేయనున్న విషయాన్ని గుర్తు చేశారు. అదానీకి అన్ని విధాలుగా మేలు చేయడానికి జివిఎంసికి తీవ్రనష్టం చేస్తున్నారని గంగారావు తెలిపారు. అదానీ సంస్థకు ప్రత్యేకంగా ఐలా ఏర్పాటు వల్ల జివిఎంసి భారీగా ఆస్తి పన్ను కోల్పోతుందన్నారు. భవనాల నిర్మాణాల ద్వారా వచ్చే బిల్డింగ్ ఛార్జీలు, ఖాళీస్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్స్, గ్రంథాలయ సెస్సు, డెవలప్‌మెంట్ చార్జీలు, బెటర్‌మెంట్, ఇంపాక్ట్ ఫీజులు, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్ను, ప్రొఫెషనల్ ట్యాక్స్ తదితర రుసుముల రూపంలో కోట్లాది రూపాయాలను జివిఎంసి నష్టపోతుందని తెలిపారు. ఇప్పటికే 130 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అదానీకి భూబదాలయింపు చేయడంతో జివిఎంసికి సుమారు రూ.5 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. జివిఎంసి మీద రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడి తీసుకొచ్చి ఏప్రిల్ 28న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఐలా ఏర్పాటుకు ఆమోదం పొందారని అన్నారు. చర్చకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా టేబుల్ అజెండా పేర ఈ నియంతృత్వ చర్యకు పాల్పడ్డారని విమర్శించారు.

ఐలా నిబంధనలకు విరుద్ధంగా బైలాను ఏర్పాటు చేశారన్నారు. ఒకవేళ గ్రేడ్ - 3 ఐలా ఏర్పాటు చేయాలన్నా 500 ఎకరాల్లో 500 పారిశ్రామిక యూనిట్లు నిర్మాణమై ఉండాలన్నారు. ఇప్పుడు కేవలం 276 ఎకరాల్లో ఐటి హిల్-4 మీద ఐలా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు అదానీకి మాత్రమే భూమి కేటాయించారని తెలిపారు. ఐలాను కేవలం అదానీ డిమాండ్ మేరకే రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే ఐటి హిల్ 1, 2, 3లలో ఉన్న పరిశ్రమలకు అవసరం రాని ఐలా కేవలం ఐటి హిల్-4కే ఏం అవసరం వచ్చిందో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే పెందుర్తిలో ఉన్న ఆటోనగర్, కంచరపాలెంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్లకు ఏర్పాటు చేయని ఐలా సంస్థలు అదానీ కంపెనీకే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. మరోపక్క అదానీ కోసం కేటాయించిన భూమిని మాస్టర్ ప్లాన్-2041లో మిక్స్‌డ్ యూజ్డ్ జోన్-2గా మార్చేశారని, దీని ప్రకారం ఆ భూమిలో స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, మెట్రో షాపింగ్ మాల్స్, ఐమాక్స్ థియేటర్లు, కమర్షియల్ బిల్డింగ్‌లు, సంపన్నుల నివాసాలకు ఎత్తైన నివాస భవనాలు తదితరమైనవన్నీ నిర్మించుకునే అవకాశం కల్పించారని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

హిల్ నెంబర్ 4పై అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తే వేల ఉద్యోగాలు వస్తాయన్న మాట అటుంచితే ఇప్పటికే ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురాక పోవడంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఇవ్వకుండా, ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై అఖిల పక్షాలను కలుపుకొని పోరాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు మోకరిల్లడం సరైనదికాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే అఖిలపక్ష పార్టీలను, సంఘాలను కలుపుకొని దేశ ప్రధానితో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌పై అందరినీ కలుపుకొని ఉద్యమిస్తామని తెలియజేయాలన్నారు.

నిలకడలేని ఆదాయం

(మొదటి పేజీ తరువాయి..) నిర్వహణకు డబ్బులు విడుదల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోంది.

2014-15 నుంచి 2022-23 వరకు జెడ్‌పికి జమైన నిధుల వివరాలు

సంవత్సరం	తలసరి గ్రాంట్ (లక్షల్లో)	సీనరేజ్	సర్‌ఛార్జ్ (లక్షల్లో)
2014-15	రూ.57.59	రూ.57.66 లక్షలు	రూ.3.44
2015-16	రూ.83.52	రూ.1.39 కోట్లు	రూ.5.25
2016-17	రూ.83.52	రూ.1.04 కోట్లు	రూ.5.09
2017-18	రూ.83.52	రూ.1.05 కోట్లు	రూ.4.32
2018-19	రూ.78.25	రూ.1.30 కోట్లు	-
2019-20	రూ.78.24	రూ.1.30 కోట్లు	రూ.5.44
2020-21	రూ.92.15	రూ.1.38 కోట్లు	రూ.7.09
2021-22	రూ.69.11	రూ.3.00 కోట్లు	రూ.7.73

టిడిపి గవర సాధికార సమితి సభ్యురాలిగా తిరుమల దేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి గవర సాధికార సమితి సభ్యురాలుగా దక్షిణ నియోజకవర్గంలోని 33వ వార్డుకు చెందిన విల్లూరి తిరుమలదేవి నియమితులయ్యారు. మంగళవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో బిసి కులాల రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, గవర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసిందని, తానూ ఆ కార్యక్రమంలో భాగస్వామినయ్యానని ఆమె స్థానిక మీడియాకు తెలిపారు.

కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న తిరుమలదేవి

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.No. 609 Of 2021

Between:
Union Bank of India,
[A Govt. of India undertaking]
[formerly]Andra Bank
rep.by Manager, Credit Card Division
Head Office, Koti, Sultan Bazar,
Hyderabad.
...Plaintiff.

AND
Mr. G.Lakshmana Murthy,
S/o Mr. Kannam Naidu,37-10-45,
East Muralinagar, D.R.Gardens,
Vishakapatnam- 07.
...Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 609 of 2021 on the file of Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,88,359.90 to your credit card ending with no. -3005. You are therefore directed to appear in person or through Advocate on 19.7.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.NAGARAJ.
V.V.S.ANNARAM
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587

శ్రీ కోర్టు వారి ఉత్తరువుల మేరకు మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 143 / 2015.

వాదులు/పిటీషనరు:
గుడ్ల నూకరాజు మరి ఒక్కరు
ప్రతివాదీ/ రెస్పాన్డెంటు:
గుడ్ల సత్తిబాబు వగైరాలు
సి.పి.సి. ఆర్డరు 5 రూలు 20 ప్రకారం 2వ ప్రతివాదికి సమనుల ప్రకటన
టు:
2వ ప్రతివాది :
గుడ్ల నూకాలతల్లి W/o. బెన్నయ్య, కూలీ ఎస్.సి.కాలనీ, నాతవరం గ్రామం మరియు మండలం, అనకాపల్లి జిల్లా

పై నెంబరు దావాలో ఇందలి 2వ ప్రతివాది/రెస్పాన్డెంటును పై నెంబరు దావాలో ప్రతివాదిగా చేర్పించమని కోరుతూ పై I.A. 369/2022 ను దాఖలు చేయగా సదరు I.A. 369/2022 తే:11-05-2023దీన వాయిదా అయి యున్నందున మీరు స్వయంగా కాని అడ్వకేటు ద్వారాగాని **తే.11-05-2023 దీన ఉదయం 10.30 గంటలకు** పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై శ్రీ కోర్టు వారికి మీ యొక్క అభ్యంతరాలను తెలియజేసుకోన వచ్చును. లేని యెడల తమ పరోక్షమందు పై వ్యాజ్యమును శ్రీ కోర్టు వారు నిర్ణయించెదరు.
వాయిదా తేదీ: 11.05.2023 లక్షీవారం.

మెట్ల ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
నర్సీపట్నం సెల్:81791 54586.
తే. 24.04.23

బహిరంగ ప్రకటన

THE SUIT OS NO 37/2021 FILED BEFORE THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM BY THE PLAINTIFFS AGAINIST THE DEFENDANTS FOR PARTITION THE PROPERTIES MENTIONED IN THE SCHEDULE

Between:
1. Chigurupalli Jhansi Rani W/O Late Venkata Surya Kumar, Hindu, Age 49 Year, House Hold Duties, resident of H.No.7-3-6/1, Nagavali Quarters, Konna Veedhi, Srikakulam Town and District, Andhra Pradesh State -Pin532 001 Aadhaar No.9065 1015 1974
2. Chigurupalli Malvica D/O Late Venkata Surya Kumar and Wife of Vamsee Mohan Pydi, Hindu, Age 28 Year, Occ. Un-employee, resident of -rest do- Aadhr No.4354 4400 6533. -Plaintiffs

And:
1. Chigurupalli Rajya Lakshmi W/O Late Venkata Surya Kumar, Hindu, House Hold Duties, Age 43 Year, presently residing at Lawsons Bay Colony, LB Colony, GVMC (PART), Visakhapatnam, Andhra Pradesh (State) Pin-530017 and Nativity of Dusi Village, Amadalavalasa. Mandalam, Srikakulam District, Andhra Pradesh (State).
2. Chigurupalli Pravalika, D/O Late Venkata Surya Kumar, Hindu, Age 16 Year, resident of -rest do-
3. Chigurupalli Vamsi Krishna Murthy S/O Late Venkata Surya Kumar, Hindu, Age 15 Year, resident of rest do.
(The Respondents No.2 and 3 being minors, represented by the next friend guardian the mother i.e., the 1st Respondent. **-Defendants**

శ్రీకాకుళం ఫస్ట్ ఎడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో ఒయస్ నెం.37/2021 ఇందులో వాదులు మరియు ప్రతివాదుల మధ్య ఇందులో షెడ్యూల్లో వివరించిన ఆస్తుల పంపకంలో తగాదాలు ఉభయపార్టీల వారి మధ్య ఉన్నందున వారికి రావాలసిన న్యాయపరమైన వాటాల నిమిత్తము ఇందులో వాదులు పార్టీషన్ సూట్ దాఖలు చేసి ఉన్నారు. కావున ఇందులో షెడ్యూల్లో వివరించిన ఆస్తులను ప్రతివాదులు అమ్మజూపిటకు ప్రయత్నం చేస్తున్నందున సదర్ ఆస్తులను ఎవరు కూడా కొనరాదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము. ఒకవేళ ఎవరైనా ఇందులో వివరించిన షెడ్యూల్ ఆస్తులు పైన వివిధమైన లావాదేవీలు జరిపించిన ఎడల ఇందులో ప్రతివాదులకు ఎట్టి సంబంధము లేదనియు సదరు కోర్టులో ఉన్న కేసు పూర్తి పరిష్కారం అయినంత వరకు వివిధమైన లావాదేవీలు చేయరాదని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

PLAINT B-SCHEDULE: House properties situated in different areas mentioned as follows:

Item No	Description and situated of Property	Reg. date. Exe. date , Press Date	Boundaries of the Property
01.	R.C.C. House G+1 situated within the Site measuring 387 Sp.Yd. in Plot No. 1, LIG, Ground Floor structure with 1100 S.Ft. and First Floor structure With 1100 S.Ft. baring Door No.4- 37-22/1 and Asst. No.33210 and Eletricity Service Connection No.45467 (GF) and 49743 (FF) Situated at Lawsons South Extension Layout coverd by S.No: 35 of chinnawaltair village, and visakhapatnam Sub and District. Registrar of Andhrapradesh state.	In the ded of partition dated 06-01-2011 in the Name of the Father of the 2nd Plaintiff mentioned in theB-Schedule	East: Plot No.2 LIG, of Lawsons- bay South Extension Layout. Dated 06-01-2011 in the South: 30 feet Wide Road, of Lawsonsbay South Extension Layout, 1,21,83,000-00 Name of the West: Padawaltair Village Site.. North: Plot No.6 of LIG of Lawson- sbay South Extension Layout.

కూన రాజారావు
వాదులుతరుపు న్యాయవాది,
శ్రీకాకుళం,
ఫోన్ 9440028468

అలరించిన సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ ప్రాంతంలోని 7వ వార్డు పరిధి ద్రోణంరాజు కళ్యాణ మండపంలో మేడే వారోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్మికులు, వారి పిల్లలు వివిధ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అభ్యుదయ గీతాలు ఆలపించడంతో పాటు, కార్మిక, అభ్యుదయ, జానపద గీతాలకు చేసిన నృత్యాలు వీక్షకులను ఎంతగానో అలరించాయి. వంటగ్యాస్ ధరలు పెంపుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణపై స్కిట్లు, చిన్నచిన్న నాటికలు వేసి ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలు మల్లయ్యపాలెం, పరదేశిపాలెం, కొమ్మాది ఎస్‌సి కాలనీ నుంచి వచ్చిన కళా కారులు ప్రదర్శించారు. వీరికి బి.పుణ్యవతి, డి.ఉమాశైలజ, కె.తేజ శిక్షణ ఇచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులు కళా ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్న బాలలను, కార్మికులను అభినందించారు. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి జరుగుతోందన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి, ప్రాణాలర్పించి 8 గంటల పని దినం సాధిస్తే నేటి బిజెపి పాలకులు కార్మికులతో 12 గంటలు పని చేయించుకోవచ్చని చెపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను కాపాడుకునేందుకు రానున్న రోజుల్లో మే డే స్ఫూర్తితో కార్మికులు, ప్రజలు ఉద్యమాల బాట పట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాజుకుమార్, డి.కొండమ్మ, ఇతర సంఘాల నాయకులు జి.కిరణ్, ఎస్.రామప్పుడు, సిహెచ్.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి- కంచరపాలెం : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఘటనకు సంబంధించి ఎయిర్ పోర్టు పోలీసుల కథనం ప్రకారం... మాధవధార తెన్నేటి నగర్ ప్రాంతానికి చెందిన హనుమంతు మల్లమ్మ (73) ఈ నెల 30వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో జ్యోతి నగర్ మీదుగా నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతోంది. ఆ సమయంలో ఎన్‌ఎడి నుంచి తాటిచెట్లపాలెం జాతీయ రహదారి మీదుగా వెళుతున్న కారు డి మార్ట్ ఎదురుగా ఆమెను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆమెను స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతిచెందారు. ఎయిర్ పోర్టు సిఐ బిఎండి ప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ టంకాల సాయి చరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వరాహ నదిలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల : పందూరు గ్రామం వద్ద వరాహ నదిలో జారిపడి మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం, పందూరు గ్రామానికి సంబంధించి వికలాంగ మహిళ అప్పికొండ నాగరత్నం (54) మంగళవారం నదిలో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు జారిపడి నీట మునిగి మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు దాదాపు 12ఏళ్లుగా భర్త నుంచి దూరంగా ఉంటోందని, ఇటీవల కొడుకు ప్రమాదవశాత్తు మరణించడంతో ఒంటరి మహిళగా గుర్తించామన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పుట్టినరోజు వేడుకల్లో విషాదం

సముద్రంలో గల్లంతై యువకుడు మృతి

ప్రజాశక్తి -ఎస్. రాయవరం : పుట్టినరోజు వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. స్నేహితుడి జన్మదినాన్ని సముద్ర తీరంలో జరిపేందుకు వెళ్లిన మిత్రబృందంలో ఒకరు సముద్రంలో గల్లంతై దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. మండలంలో వుపోలవరంసముద్రతీరంలో యువకుడు అలలకు కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యాడు. నర్సీపట్నం దరి గురందొరపాలెం గ్రామానికి చెందిన కొళ్ళన జగదీష్ (18) అనే యువకుడు తన స్నేహితుడు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నలుగురు స్నేహితులతో కలిసి సముద్రతీరం ఒడ్డున కేక్ కటింగ్‌కు వెళ్లాడు, కేక్ కట్ చేసిన తర్వాత సముద్ర స్నానాలకు దిగిన యువకుల్లో జగదీష్ అలల తాకిడికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, గాలింపులు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ప్రసాదరావు తెలిపారు.

కేంద్ర కారాగారానికి బోరు వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీల అవసరార్థం ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు ఆర్థిక సాయంతో మంగళవారం బోర్ వేసే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రకారాగార పర్యవేక్షణాధికారి మాట్లాడుతూ, కేంద్రకారాగారంలో నీటి సమస్య ఉందన్న విషయం తెలుసుకుని బోర్‌ను తవ్వించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. గతంలో కూడా కంచర్ల అచ్యుతరావు ఖైదీల అవసరార్థం అనేక కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జైలు అడిషనల్ ఎస్‌పి వెంకటేశ్వర్లు, జైలు అధికారులు, ఉపకార ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు సుధీర్‌కుమార్, నాగరాజు, భాస్కర్, ధనరాజ్, రాము పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నేతాజీనగర్, రామకృష్ణాపురంలో పోలమాంబ అమ్మవారి పండగలో భాగంగా మంగళవారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్యఅతిథిగా హాజరై అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాయన వెంకటఅప్పారావు, 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, పోలారావు, పోతిన భరత్ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ నివారణాధికారి పూర్ణేంద్రబాబు మంగళవారం సందర్శించారు. సిహెచ్‌సిలోని క్షయ వ్యాధి నివారణ విభాగాన్ని పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో టిబీ యూనిట్ సూపర్‌వైజర్లు ప్రేమ్‌కుమార్, చక్రవర్తి పాల్గొన్నారు. అనంతరం జివిఎంసి 4వ వార్డు చేపలుప్పాడ యుపిహెచ్‌సిని సందర్శించారు.

ఉపాధి హామీ కూలీలకు కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పంచాయతీ ఎస్సీ, ఎస్టీ ఉపాధి హామీ పథకంలో భాగంగా 20 మంది లబ్ధిదారులకు జాబ్ కార్డులను ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కార్మికులకు రోజుకు రూ.272 జమవుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయపాలన పాటించాలి : డిఎం అండ్ హెచ్‌ఓ

ప్రజాశక్తి -మధురవాడ : వైద్య, ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. ఆశా డే సందర్భంగా మధురవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంతో పాటు యుపిహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో మంగళవారం డాక్టర్ పి.జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది ఉదయం 9 గంటలకే విధులకు హాజరై సమయపాలన పాటించాలన్నారు. అన్ని యుపిహెచ్‌ల వైద్యులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్సీడీ సర్వే, గర్భిణీ (ఎఎన్‌సి) లను గుర్తించి టిటి అందజేయాలని, బర్త్ ప్లానింగ్, హై రిస్క్ గర్భిణీలను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్, ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు వారిని ప్రోత్సహించాలని సూచించారు. కుటుంబ డాక్టర్ విధానం గురించి వైద్యులకు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధిక శాతం సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని చెప్పారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమావతి, మధురవాడ వైద్యాధికారి ప్రశాంతి పాల్గొన్నారు.

విస్తృతంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సేవలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ద్వారా మరింత విస్తృతంగా సేవలందించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షులు పి.జగన్మోహనరావు తెలిపారు. స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కౌన్సిల్ నూతన రాష్ట్ర కార్యవర్గం తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగన్మోహనరావు మాట్లాడుతూ, మానవ హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా తమను సంప్రదిస్తే బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. ఉపాధ్యక్షులు మాధవి మాట్లాడుతూ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రాధాన్యతపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం పాటు పడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కె.దుర్గాశ్రీనివాస్, సహాయ కార్యదర్శి వైకుంఠరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయుడు, కార్య నిర్వాహక సభ్యులు వెంకటరమణ, ఎం.సూర్యశ్రీనివాస్, ప్రసాద్, స్థానిక కౌన్సిల్ సభ్యులు కాళ్ళ సన్నీ, కె.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అనుసరించి ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో భాగంగా ఇప్పటికే 829 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామని పేర్కొన్నారు. రెండో విడతలో భాగంగా ప్రవేశాలకు ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను మీ దగ్గరలో ఉన్న సచివాలయంలో ఉచితంగా సిఎస్‌ఇ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధి కుమ్మరిపాలెం, వలంద భూముల్లో జిపిఆర్ లే-అవుట్‌లో ఓపెన్ స్పేస్‌లో నిర్మించిన ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.శ్రీనివాసరావు, టిపిఒ ఝాన్సీ ఆధ్వర్యాన సిబ్బంది మంగళవారం తొలగించారు. లే-అవుట్లకు సంబంధించిన ఓపెన్ స్పేస్‌ను ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు హెచ్చరించారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు జివిఎంసి పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి 4 లీటర్ల చొప్పున కొబ్బరి నూనె అందజేశారు. జివిఎంసి నిధులతో సమకూర్చిన కొబ్బరినూనెను మంగళవారం కార్మికులు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉద్యోగ విజయోత్సవం

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు 'ఉద్యోగ విజయోత్సవం' మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ప్రత్యేక అతిథిగా 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజనీశ్వరరావు హాజరై ముందుగా లన్స్ జిఐసిఇ లోగోను ప్రారంభించారు. అనంతరం కాలేజ్ ప్రిన్సిపాల్ కె.వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత ఉద్యోగావకాశాలు సాధించడం గర్వకారణమన్నారు. డిప్లమో స్థాయిలో ఏకైక కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీగా గుర్తింపు పొందిన ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చదివిన విద్యార్థులందరూ అత్యధిక స్థాయిలో జీతాలు పొంది ఉద్యోగాలు సాధించడం మంచి పరిణామం అన్నారు. ఈ కాలేజీ ఒక ఏడాదిలోనే 240 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణతో పాటు ఇతర అధ్యాపకులను ఆమె ప్రశంసించారు. ఈ కాలేజీలో చదివిన డి.వంశీప్రియాంక ఏషియన్ పెయింట్స్‌లో రూ.6.73 లక్షల వార్షిక జీతంతో ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. మరో 54 మంది బాలికలు ఉద్యోగాలు సాధించడం మహిళాసాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. హెచ్‌పిసిఎల్‌లో 35 మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. కార్పొరేటర్ చల్లా రజని ఈశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా నిలిచిన కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ తమ వార్డులో ఉండడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రిన్సిపల్ వెంకటరమణ మాట్లాడుతూ తమ కాలేజీకి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుతోపాటు ప్రిన్సిపల్ గ్లోబల్ అచీవ్‌మెంట్ అవార్డులు, ఇంటర్నేషనల్ అకడమిక్ లీడర్, గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డు లభించినట్లు చెప్పారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థినీవిద్యార్థులకు నియామక పత్రాలను మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కార్పొరేటర్ చల్లా రజనీఈశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఒ.ఆర్‌ఎ.రావు, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎ.వరహాలు, పూర్వ విద్యార్థి డాక్టర్ బి.దేముడు, యుఎస్.శర్మ, బిఎస్.రామ్మోహన్, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బివి.లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్స్ సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.రవీందర్, డాక్టర్ కె.ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

బహుమతులందుకున్న క్రీడాకారులు

మాధవధార అభివృద్ధికి తోడ్పాటు

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ కోరారు. శ్రీ మాధవ యువజన సమాజం 77వ వార్షికోత్సవాన్ని భరద్వాజ క్షేత్రంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాల్‌రావు, సహాయ కన్వీనర్ వప్పల రామచంద్రరావు మాట్లాడుతూ, మాధవధార గ్రామ అభివృద్ధిలో భాగంగా పేదలకు ఉపయోగపడే విధంగా నూతన భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ నూతన భవన నిర్మాణంలో సహాయ సహకారాలు అందజేసి భాగస్వామ్యం కావాలని కోరారు. మాధవధార ప్రాంతంలో పూర్వ నుంచి స్థానికంగా ఉండే ప్రజలు తమ సొంత ఆస్తులు సైతం సమాజ అభివృద్ధికి విరాళాలుగా అందజేశారని గుర్తు చేశారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ మాధవ యువజన సమాజం ఆధ్వర్యాన క్రికెట్ పోటీలతో పాటు వివిధ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళా హాస్పిటల్ నిర్వాహకులు పైడి వెంకట రమణమూర్తి, వైసిపి మహిళా నాయకురాలు పేడాడ రమణకుమారి, బగాది శ్యామల, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి, రోడ్లు భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సనపల సురేష్ కుమార్, విశాఖ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పేడాడ జగదీశ్వరరావు, కాంట్రాక్టర్ మూల మోహనప్రసాద్, ప్రముఖ న్యాయవాది సనపల కరుణ, సనపల నారాయణస్వామి, వావిలపల్లి వెంకటరావు, శ్రీ మాధవ యువజన సమాజం కార్యవర్గ సభ్యులు, మాధవధార గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : నారీ భేరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వైశాఖ మాసం వసంత గానం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి వీక్షకులను అలరించింది. చల్లని గాలి చక్కని తోట పాటను పెమ్మరాజు రామ్, శైలజ మెరాజ్, ఏదో పిలిచినది పాటను వివి చారి, సీవీ రాజేశ్వరి, ఇక్కడే కలుసుకున్నాము పాటను పుండరీ కుమార్, భాగ్యలక్ష్మి, ఆనందో బ్రహ్మ పాటను వెంకటరెడ్డి, శైలజ ఆలపించి ప్రేక్షకుల మదిని రంజింపచేశారు.

రోగులకు మందులు అందజేస్తున్న హ్యూమన్ రైట్స్ కేర్ ప్రతినిధులు

ప్రజారోగ్యంపై హ్యూమన్ రైట్స్ కేర్ కృషి

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రజల ఆరోగ్యంపై హ్యూమన్ రైట్స్ కేర్ కృషిచేస్తోందని సంస్థ నేషనల్ ఛైర్మన్ రాజాన ప్రసాదరావు తెలిపారు. 94వ వార్డు పరిధి నాయుడుతోటలోని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత మానవ హక్కుల సంరక్షణ ఆధ్వర్యాన విజయనగరంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి సుమారు 300 మందికి పైగా వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వారికి సరైన సమయంలో మందులు దొరకకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సేవా నిమిత్తం ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతుందని వివరించారు. రానున్న కాలంలో అన్ని ప్రాంతాల ప్రజలకు ఈ సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం అనంతరం వైద్య శిబిరంలో సేవలందించిన సేవా సమితి సభ్యులను, డాక్టర్లను ఆర్గనైజర్లను, ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మీడియా సెక్రెటరీ టి.రవికుమార్, ఆర్‌టిఐ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ టి.హరిబాబు, జి.రాజశేఖర్, సంస్థ ప్రతినిధులు దోలా శంకరరావు, ఆర్.ఇషిత, పిఎస్.రాజు, ఆర్.విజయ, ఎం.సుగుణకుమార్, కె.వరలక్ష్మి, ఆర్ రుషిత, పి.హేమలత, ఆర్ లక్ష్మణరావు, జి.రమేష్, వై.అప్పారావు, పి.ఈశ్వరరావు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కె.సూర్యనారాయణ వర్ధంతి

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఫౌండర్ కె.సూర్యనారాయణ ద్వితీయ వర్ధంతిని సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటకృష్ణ, సిఐటియు మల్కాపురం జోన్ సీనియర్ నాయకులు కె.నూకరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు అధ్యక్షతన జరిగిన సభలో వెంకటకృష్ణ మాట్లాడుతూ, హెచ్‌పిసిఎల్ రిఫైనరీలో కార్మికుల సమస్యలపై అందరినీ ఐక్యంచేసి నిరంతరమూ పోరాడారని గుర్తుచేశారు. పోరాటాలు చేసిన సందర్భంలో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం అనేక నిర్బంధాలకు గురిచేసిందని తెలిపారు. సస్పెన్షన్, బదిలీలు చేసినా కార్మిక వర్గాన్ని ఐక్యంచేయడంలోనూ, సిఐటియు జెండాను విడువలేదని తెలిపారు. కరోనా మహమ్మారి గొప్ప కార్మికనేతను బలితీసుకొందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సూర్యనారాయణ పోరాట స్ఫూర్తితో మనమంతా పనిచేసినప్పుడే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు.

సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నీజాయతీ, నిబద్ధతగల నేత సూర్యనారాయణ అన్నారు. తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని తెలిపారు. హెచ్‌పిసిఎల్ కంపెనీలోనే కాకుండా సిపిఎం మల్కాపురంజోన్ కమిటీ సభ్యుడుగా ప్రజా సమస్యపై కూడా పనిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు వి.బాబూరావు, ఎ.సత్యారావు, ఎన్.ఉమావిజయ, హెచ్‌పిసిఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెంకటేష్, వివేక్, భాస్కర్, ఉమామహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.36 వేలు చెల్లించాలి

గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగన్ తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : వైజాగ్ పోర్టులో మాదిరిగానే ఆదాని గంగవరం పోర్టులో కార్మికులకు, కనీస జీతం రూ.36 వేలు చెల్లించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్, ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు డిమాండ్ చేశారు. గాజువాకలోని ఎస్‌బిటి హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, రూ.36 వేలు జీతం ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.1500 నుంచి రూ.2500 మాత్రమే ఇంక్రిమెంట్ వేయడంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 14 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు రూ.13 వేలు నుంచి రూ.16,600, ఐదేళ్లగా పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.9,000 నుంచి రూ.9,800 వేతనాలు చెల్లించడం దారుణం అన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడు ఇచ్చిన రూ.3700 బేసిక్ నేటికీ కొనసాగుతోందని తెలిపారు. 14 సంవత్సరాల పైబడి పనిచేస్తున్న కార్మికులకు కూడా బేసిక్‌లో ఎలాంటి మార్పు లేదన్నారు. గంగవరం పోర్టు నిర్మాణంలో సర్వం త్యాగం చేయడం ద్వారా నియమితులైన నిర్వాసిత ఉద్యోగులకు పేరుకే పర్మినెంట్ అని, జీతభత్యాలు చాలా దారుణంగా ఉన్నాయని తెలిపారు. కనీసం ప్రతి ఏడాదీ ఇస్తున్న ఇంక్రిమెంట్లు కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చెల్లించడం లేదన్నారు. ఆదాని గంగవరం పోర్టులో కార్మికులకు చట్టపరమైన వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పక్కనే ఉన్న విశాఖ పోర్టు, స్టీల్‌ప్లాంట్‌లో పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో సగం కూడా గంగవరం పోర్టు కార్మికులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. మెమోలు, ఛార్జిషీట్ లిస్టు తదితర ఏదో ఒక సాకుతో ఉద్యోగాలు తొలగిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి విశాఖ వస్తున్న సందర్భంగా ఆదానితో మాట్లాడి ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్మికులతో సమావేశం ఏర్పాటుచేసి ఇంక్రిమెంట్లు, వేతనాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అక్రమంగా ఉద్యోగం నుంచి తొలగించిన గంటపల్లి లక్ష్మయ్య, కదిరి భూలోకరావును విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పేర్ల నూకరాజు, వాసుపల్లి యల్లయ్య, కదిరి సత్తిరాజు, మాదా అప్పారావు, కోనేటి వెంకటరమణ, గంటిపిల్ల అమ్మోరు, అప్పారావు, కదిరి తాతారావు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మాధవధార : అకాల వర్షాలకు అపారంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ విభాగ ఛైర్మన్ మూల వెంకటరావు కోరారు. కోతకు వచ్చిన పంటలు నీట మునిగాయని, కళ్లాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయని, మామిడికాయలు రాలిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు అన్నదాతలను నిలువునా ముంచేశాయని ఆవేదనవ్యక్తంచేశారు. సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రూ.కోట్లలో పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కళ్లాల్లో తడిసిపోయి ఉన్న మిరప, జొన్న, మొక్కజొన్న, పొగాకు పంటలకు కొనుగోలు చేసేందుకు వెంటనే మార్కెట్ పాయింట్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయాలని కోరారు. లంక గ్రామాల్లో ఇటుక పరిశ్రమకు వర్షంతో తీవ్ర నష్టం కలిగిందని, తీర ప్రాంతాల్లోని ఉప్పు కరిగిపోయిందని తెలిపారు. మరో రెండు రోజులు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి రైతులకు సహాయపడాలని కోరారు. గోదావరి జిల్లాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వల్ల తడిసి ముద్దయిపోతున్నాయని ఆరోపించారు. నష్టపోయిన రైతుల వద్దకు తక్షణమే ఆయా జిల్లాల్లోని మంత్రులను, నాయకులను పంపించి ఆర్థికంగా, మానసికంగా ముఖ్యమంత్రి భరోసా కల్పించాలని కోరారు.

శ్యామలాంబ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపును మంగళవారం ఆలయ ఆవరణలో ఈవో రమప్రభ ఆధ్వర్యాన చేపట్టారు. నెల రోజులకు గానూ రూ.11,530 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మురళి, దేవస్థానం అధికారి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-వేపగుంట : వేసవి నేపథ్యంలో జోన్-8 పరిధిలో 18 చలివేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు జివిఎంసి జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. ఈ చలివేంద్రాలను ముఖ్యంగా బస్టాపుల వద్ద ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో కేంద్రం వద్ద సిబ్బందిని కూడా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎనిమిది చోట్ల గ్రీన్ షెల్టర్లను కూడా ఏర్పాటుచేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ కోరారు.

ఇండోర్ గేమ్స్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : వేసవి సెలవుల నేపథ్యంలో హిందూస్తాన్ షిప్‌యార్డ్ వెల్ఫేర్ అండ్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యాన కాలనీలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ బాడ్మింటిన్, టేబుల్ టెన్నిస్, కేరమ్స్, చెస్ తదితర ఆటలలో ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. మంగళవారం సాయంత్రం షిప్‌యార్డు ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్‌వి.రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటలు పిల్లల మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ వేసవి సెలవులలో ఆటలపై ఆసక్తి చూపి మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ఛైర్మన్ బేగ్, సునీల్, జయంతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ రాంబాబు

చి'వరి' పాట్లు

◆ అకాల వర్షాలకు నీట మునిగిన పంట

◆ రక్షించుకునేందుకు రైతుల నానా అగచాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

అన్నదాత చేతికి పంట వచ్చే వరకు నమ్మకం ఉండదనడానికి ఈ ఫొటోల్లో పరిస్థితే నిదర్శనం. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు పంటలు సాగు చేయగా, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు ఆ పంటలను దెబ్బతీస్తున్నాయి. సోమ, మంగళ వారాల్లో కురిసిన వర్షాలకు మండలంలోని వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఆ పంటను వదులుకోలేక ఏదో విధంగా కొంత పంటనైనా దక్కించుకుందామన్న ఉద్దేశంతో కూలీలను పెట్టి నీట మునిగిన వరి పంటను ఒడ్డుకు తెచ్చారు. చెక్కలు, మంచాలపై కొట్టి ధాన్యాన్ని సేకరిస్తున్నారు.

చిన్నప్పన్నపాలెంలో నీట మునిగిన వరి పంటను ఒడ్డుకు తెచ్చి ధాన్యాన్ని దులుపుతున్న రైతులు

తడిసిన వరి చేనును ఒడ్డుకు తెస్తున్న రైతు దొండ వెంకటరమణ

బుచ్చయ్యపేట మండలం, కస్పా పరిధిలోని వడ్డాది, విజయరామరాజుపేట, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి, చోడవరం మండలం బెన్నవోలు, గౌరీపట్నం గ్రామాల రైతులు సుమారు 200 ఎకరాలకు పైగా భూముల్లో రబీ సాగులో భాగంగా వరి పంట వేశారు. ప్రస్తుతం ఆ పంట కోత దశకు వచ్చింది. సుమారు 50 నుండి 60 ఎకరాలకు పైగా భూముల్లో వరి పంట పూర్తిగా పండడంతో ఆదివారం కోతలు కోసి పంటను పొలాల్లో ఆరబెట్టారు. అయితే సోమ, మంగళవారాల్లో భారీ వర్షం కురవడంతో కోత కోసిన పొలాల్లో నీరు చేరడంతో వరి పనలు నీటములుగాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు నీట మునిగిన వరి పంటను ఒడ్డుకు చేర్చి, చెక్కలు, మంచాలపై కొట్టి వరి ధాన్యాన్ని రక్షించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు రూ.25 వేలు నుండి రూ.30వేలు వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. మండలంలోని చిన్నప్పన్నపాలెం గ్రామానికి చెందిన రైతు దొండ వెంకటరమణ మాట్లాడుతూ తను రెండు ఎకరాలకు పైగా వేసిన వరి పంట మొత్తం నీట మునిగిపోయిందని వాపోయాడు. కొల్లివలస నాగరాజు, సిరసపల్లి వాసు, సిరసపల్లి నానాజీ, పోతు అప్పారావు, ముమ్మిన సూర్యనారాయణ తదితరులకు చెందిన వరి పంట కూడా నీట మునిగిపోయింది. పంట నీటమునిగి తడిసిపోవడంతో ధాన్యం రంగు మారే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల నిరసనలు

కశింకోటలో ఆందోళన అనంతరం వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పరవాడలో..

రావికమతంలో...

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం జిల్లాలోని పలు పిహెచ్‌సిల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిల వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

మునగపాక రూరల్ : మునగపాక పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన తెలియజేశారు. అనంతరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నారని, పని ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ వార్డు, సచివాలయాల్లో ఆశా కార్యకర్తలు ఉండాలని, సబ్ సెంటర్‌కు వచ్చి రోజు సంతకాలు పెట్టాలనడం సరికాదని పేర్కొన్నారు. వారిపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారి, ఉమా, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

సబ్బవరం : ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఐద్వా అధ్యక్షులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్ఎన్ఆర్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ ఇవ్వాలని, అదనపు పనులను అప్పగించరాదని కోరారు. యూనియన్ నాయకులు డి.భవాని, జి.శ్రీకాంతి, జి.వరలక్ష్మి, ఎస్.కృష్ణవేణి, పి.కల్యాణి, డి.జయ, కె.దేవి, వై.కనకమ్మ, ఎ.అనురాధ, సిపిఎం నాయకులు ఎం.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టి, మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు భార్గవి, శాంతి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యకర్తలు సంతోషి, వెంకటలక్ష్మి, పార్వతి, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ, వాడు చీపురుపల్లి పిహెచ్‌సిల వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి, మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ మండల నాయకులు వెన్నెల లక్ష్మి అనకాపల్లి వరలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, పి.సత్యవతి, లక్ష్మి, మాని, జయ, పి.మణిక్యం పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, తురకలపూడి పిహెచ్‌సిల వద్ద ఆశా కార్యకర్తలు ఆందోళన చేశారు. యూనియన్ నాయకులు సనివాడ లక్ష్మి, దుర్గవరపు వరలక్ష్మి మాట్లాడుతూ ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి డిమాండ్ చేశారు. రికార్డులను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ శాంతికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టేకు అంబిక, లక్ష్మి పాల్గొన్నారు.

రావికమతం : తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. ఆశ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వజ్రపు సత్యవతి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే తమను సచివాలయాల వద్ద ఉండాలనడం విడ్డూరమన్నారు.ఆశా వర్కర్లకు జాబ్‌చార్ట్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారుల ఒత్తిళ్ల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

మాడుగుల : ఆశాకార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ నరసింహామూర్తి, ఆశ వర్కర్ల మండల అధ్యక్షులు జి.లక్ష్మి, కార్యదర్శి పడాల ప్రసన్న డిమాండ్ చేశారు. మంగళవారం కెజె పురం పిహెచ్‌సి వద్ద ఆందోళన చేపట్టి, డాక్టర్ లీలా ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

సబ్బవరంలో...

బుచ్చయ్యపేటలో ఆందోళన చేస్తున్న ఆశాలు

మాడుగులలో..

పాలిసెట్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం బూడి

పాలీసెట్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టు (పాలిసెట్)కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా మంగళవారం మండలంలో తారువలో ఆయన క్యాంపు కార్యాలయంలో మెటీరియల్ అందజేశారు. ఉప ముఖ్యమంత్రి సూచన మేరకు పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 25 నుండి ఎపిఆర్‌జెసి, పాలిసెట్‌కు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను అందేజేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కృషి ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి సత్యం, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి కెవి.రమణ, వైసిపి నాయకులు కోరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

లోకోస్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : డిఆర్‌డిఎ ఆధ్వర్యాన స్థానిక మండల సమాఖ్య సమావేశ మందిరంలో మండల సమాఖ్యల సభ్యులకు లోకోస్ యాప్‌పై శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ లోకోస్ యాప్‌పై అవగాహన ప్రతి సభ్యులు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ శిక్షణకు 52 మంది విఓఏలు హాజరయ్యారు. శరగడం సత్యవతి అధ్యక్షత వహించి లోకస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏపిఎం వై.బాలరాజు, సీసీలు కొండయ్య, గణేశ్వర రావు, రాజు, చిట్టెమ్మ, వెంకటరావు, అకౌంటెంట్ నాగేశ్వరరావు, రాజేశ్వరి పాల్గొన్నారు

కన్నబాబురాజుపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజుపై తప్పుడు ప్రచారం చేయడం తగదని వైసీపీ నియోజకవర్గ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు, నాయకులు కోన బుజ్జి, చేపల వెంకటరమణ జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, ఎలమంచిలి ఎంపిపి బోదేపు గోవింద తదితరులు సోమవారం పూడిమడకలో జరిగిన సంఘటనపై మాట్లాడారు. కన్నబాబురాజు రాజకీయ ఎదుగుదలను చూసి తట్టుకోలేక పార్టీకి చెందిన కొంతమంది తప్పుడు ప్రచారానికి పాల్పడ్డారని ఆరోపించారు. పూడిమడక గ్రామ సముద్ర తీరంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు, ఏషియన్ పెయింట్స్ నిధులతో హాస్పిటల్ నిర్మాణం, జెట్టీ నిర్మాణం, బ్రాండిక్స్ సహకారాలతో తీరంలో పారిశుధ్య నిర్వహణ వంటి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే కన్నబాబురాజు చేపడుతున్నారని చెప్పారు. పథకం ప్రకారం ఆయనపై దాడి చేయడం విచారకరమన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరనూ కలిసి పనిచేస్తేనే రానున్న ఎన్నికలలో విజయం చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఒడిసెల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు పిన్నమరాజు వాసు, బొద్దపు ఎర్రయ్య దొర, మారిశెట్టి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజానీకానికి వైద్యం ఇంటి ముంగిటకే తీసుకువచ్చిందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వంటి రోగాలను తగ్గించే మందులతో పాటు పలు రుగ్మతలకు సంబంధించిన మందులను శిబిరం వద్దనే అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, హెచ్‌వి లక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి సంతోషి, ఏఎన్ఎం రేవతి, హెల్త్ అసిస్టెంట్ జగన్నాథరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపైకి ధ్వజ స్తంభం తరలింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామంలోని దేముడు కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి దమ్మలపాటి అప్పారావు చౌదరి ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవారం కొండపైకి తరలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, వాకపల్లి సర్పంచ్ బుగత రాజేశ్వరి వెంకటరమణ, మారేపల్లి ఎంపిటిసి అవుగడ్డ రామాదేవి, మాజీ సర్పంచ్ అవుగడ్డ కోటిపల్లి నాయుడు, బుదిరెడ్ల బాబురావు, అవుగడ్డ వెంకట త్రినాథ నాయుడు, కిల్లి గోవింద, నెక్కళ్ల శ్రీనివాసరావు, సూపరవైజర్ విసారపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి వామపక్షాల ఆందోళనకు కాంగ్రెస్ మద్దతు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లి పట్టణంలో చేయనున్న ఆందోళన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షులు దాసరి సంతోష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు నెహ్రూ చౌక్ జంక్షన్‌కు బుధవారం ఉదయం 9 గంటలకు చేరుకోవాలని కోరారు.

రజనీకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి- అనకాపల్లి : వైసిపి ప్రభుత్వంపై సూపర్ స్టార్ రజనీకాంత్ ఎటువంటి విమర్శలు చేయకపోయినా, ఆయనపై రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా, మాజీ మంత్రి కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేయడం అర్థరహితమని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వారి నాయకుడు జగన్ రెడ్డి మెప్పుకోసం ఇటువంటి దిగజారుడు మాటలు మాట్లాడటం సరికాదన్నారు. ఎన్టీఆర్ శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన సభలో ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని, తన అనుభవాలను రజనీకాంత్ పంచుకున్నారని తెలిపారు. దీనిపై మంత్రులు జుగుప్సాకరమైన విమర్శలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వారిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

ఆయిల్ పామ్ సాగు పెంపునకు కృషి

కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశం

ఆయిల్ పామ్ సర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణత పెంచేందుకు ఉద్యానవన శాఖ కృషి చేయాలని కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. తుమ్మపాల రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, అగ్రి, హార్టీ ఎఫ్‌పిఓ, కె.కోటపాడు కృషిఫల ఎఫ్‌పిఓ, అడ్డూరు సుఫలా జాగృతి ఎఫ్‌పిఓను సందర్శించి ఉద్యానవన శాఖ ద్వారా అందుతున్న పథకాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కలెక్షన్ సెంటర్లను కోల్డ్ స్టోరేజీలను పరిశీలించారు. బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట గ్రామంలో శాంతి ఆయిల్ పామ్ నర్సరీలను సందర్శించారు. ఉద్యానవన శాఖ చేపట్టిన పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అయిన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్ రావు, తుమ్మపాల ఎఫ్‌పిఓల సంఘం అధ్యక్షులు పడాల గణపతి రావు, కార్యదర్శి ఎరుబండి సత్యనారాయణ, ఉద్యానవన శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు, ఎఫ్‌పిఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల సేకరణ కేంద్రాలు ఎంతో ఉపయోగకరం

కె.కోటపాడు : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పళ్ళు, కూరగాయల సేకరణ కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. సోమవారం మండలంలోని గొండుపాలెంలో నిర్మిస్తున్న కూరగాయల కలెక్షన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గ్రూపుగా ఏర్పడి వారు పండించిన ఉత్పత్తులను ఈ కలెక్షన్ సెంటర్ ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఈ కలెక్షన్ సెంటర్లు నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. కె.కోటపాడు మండలంలో ఐదు సెంటర్లు మంజూరు కాగా, గొండుపాలెం, కింతాడ, కె.సంతపాలెం, పింద్రంగి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. కూరగాయలు, పళ్ళు తదితర ఉత్పత్తులను మార్కెటుకు తరలించడానికి వాహనాలు, ఇతర సౌకర్యాలన్నీ రైతు ఉత్పత్తిదారుల సంస్థకే మంజూరు చేయబడతాయని చెప్పారు. ఒక్కో కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి రూ.15 లక్షల మంజూరు చేశామన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, స్థానిక ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి, వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు

ప్రజాశక్తి-చోడవరం

జగన్ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. నిరుద్యోగం పెరగడంతో పాటు సామాన్య ప్రజానీకానికి ధరలు అందుబాటులో లేవని తెలిపారు. మద్యం రేట్లు పెంచి విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేటి నాగ గంగాధర్, తెలుగు యువత నాయకులు సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి పింఛనుపై కదలిక

సెర్ప్ అధికారులకు జిల్లా యంత్రాంగం నివేదిక

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం, పోలేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు తెగడ సన్నమ్మకు పింఛను తొలగింపుపై '90 ఏళ్ల వృద్ధురాలికి పింఛను కోత' శీర్షికన ఏప్రిల్ 30 ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. వృద్ధురాలికి రెండున్నరేళ్లగా పింఛను నిలిచిపోవడంతో ఆమె పడుతున్న ఇబ్బందులను ప్రజాశక్తి తన కథనంలో తెలియజేసింది. దీంతో డిఆర్‌డిఎ అనకాపల్లి జిల్లా అధికారులు బుచ్చయ్యపేట మండల అభివృద్ధి అధికారిని వివరాలు కోరారు. ఈ మేరకు బుచ్చయ్యపేట ఎంపిడిఒ సోమవారం నివేదిక అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక రేషన్ కార్డుకు ఒక పింఛను అమలవుతుందని, వృద్ధురాలితో పాటు ఆమె కుమార్తెకు పింఛను రావడం, వారిద్దరూ ఒకే రేషన్ కార్డులో ఉండడంతో వృద్ధురాలి పెన్షన్ నిలిచిపోయిందని డిఆర్‌డిఎ జిల్లా అధికారులకు ఎంపిడిఒ తెలియజేశారు. ఈ నివేదికను పరిశీలించి, వృద్ధురాలు తేగడ సన్నమ్మను ప్రత్యేక కేసుగా పరిగణించి పింఛను మంజూరు చేయాలని విజయవాడ సెర్ఫ్ అధికారులకు లేఖ రాసినట్లు డిఆర్‌డిఎ పిఒ లక్ష్మీపతి మంగళవారం తెలిపారు.

కుక్కల దాడిలో నాటుకోళ్లు మృతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో కుక్కల దాడి చేయడంతో నాటుకోళ్ళ మృతి చెందినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని కుక్కలు కల్లాల్లో మూసిఉన్న నాటు కోళ్లను సోమవారం రాత్రి దాడులు చేసి చంపాయని వాపోయారు. గ్రామంలోని కన్నంరెడ్డి రమణకు చెందిన 19 కోళ్ళు, గొర్లి రాముకి చెందిన 7 కోళ్ళు, జెట్టి వెంకట స్వామికి చెందిన రెండు కోళు, గొట్టివాడ ఈశ్వరరావుకి చెందిన 14 కోళ్ళు, చైతన్య కుమార్‌కు చెందిన 80 కోళు కుక్కల దాడికి బలయ్యాయని తెలిపారు. కుక్కల బెడద నుండి తమ కోళ్లకు రక్షణ కల్పించాలని గ్రామ పంచాయతీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

మృతి చెందిన కోళ్లు వద్ద బాధితులు

గ్రామాల్లో వైభవంగా అమ్మవార్ల పండగలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడలో పెద్ద పైడిమాంబ, దేవరాపల్లి మండలం తారువలో మర్లమాంబ, కశింకోట మండలం కన్నూరుపాలెంలో పైడితల్లమ్మ, అనకాపల్లి మండలం గొలగాం గ్రామంలో పైడిమాంబ అమ్మవారుల పండగ మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి.

పెద్ద పైడిమాంబ అమ్మవారి తీర్థం

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో మంగళవారం పెద్ద పైడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కలు తీర్చుకొని తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మహిళల కోలాట పోటీలు నిర్వహించి గెలుపొందిన 10 గ్రూపుల మహిళలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు రాయపురెడ్డి కృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధి రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్లమాంబ అమ్మవారి మహోత్సవం

దేవరాపల్లి : మండలంలోని తారువ మర్లమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 11 వసంతాలు తరువాత జరుగుతున్న పండగకు దూర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామస్తులు రావడంతో ఊరంతా కోలాహలంగా మారిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను డిప్యూటీ సిఎం బూడి దగ్గర ఉండి పర్యవేక్షించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పైడితల్లమ్మ అమ్మవారి పండగ

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇందులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందేం పోటీలను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు దంతులూరి శ్రీధర్ రాజు, కశింకోట, అనకాపల్లి ఎంపిపిలు కలగా లక్ష్మి, గొర్లి సూరిబాబు, సర్పంచ్‌లు కలగా గున్నయ నాయుడు, శిరపరపు శివ, హనుమంతు వెంకట లక్ష్మణరావు పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో ఎడ్ల పరుగు పందెం పోటీలు



శరగోపం అందజేస్తున్న మళ్ల జయమ్మ

పెద్ద పైడిమాంబకు శరగోపం వితరణ

కె.కోటపాడు : పెద్ద పైడిమాంబ అమ్మవారికి మునగపాక మండల పరిషత్ అధ్యక్షురాలు మళ్ల జయమ్మ రూ.35వేలు విలువైన వెండి శరగోపం మంగళవారం అమ్మవారి ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు రాజి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను సంపాదించిన దాంట్లో కొంత దైవ కార్యాలకు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు కుంచా అంజిబాబు, గొర్రె నారాయణరావు పాల్గొన్నారు.

పైడిమాంబ అమ్మవారి జాతర

అనకాపల్లి : మండలంలోని గొలగాం గ్రామంలోని శ్రీపైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగ నరసింగరావు, గ్రామ వైసిపి నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం!

నీటిట్యాంకుకు సమీపంలోనే ఇసుక తవ్వకాలు
హెచ్చరించి, పట్టనట్లు వదిలేసిన అధికారులు

ట్యాంక్ సమీపంలో ఇసుకను తవ్వుతున్న నాటుబళ్ల యజమానులు

ప్రజాశక్తి- కొత్తకోట : మేజర్ పంచాయితీ కొత్తకోటలో ఇంటింటికి తాగు నీటి అవసరాలు తీర్చేందుకు ధర్మవరం గ్రామ సమీపంలో వరహా నదిలో నిర్మించిన రక్షిత (ట్యాంక్)తాగునీటి పధకానికి ప్రమాదం పొంచి ఉంది. కొత్తకోటకు చెందిన ఇసుక బళ్ల యజమానులు రాత్రి, పగలు తేడా లేకుండా రక్షిత పథకం ట్యాంక్ చుట్టూ ఇసుకను తవ్వి, తరలించడంతో కూలిపోయే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గ్రామంలో తాగు నీటి అవసరాలు తీర్చేందుకు సుమారు రూ.7 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో ఇంటింటికి తాగు నీరు అందించే పనులు ఇప్పటికే పూర్తి కావస్తూన్నాయి. ఎక్కువ వాటర్ సోర్సింగ్ ఉండటంతో ధర్మవరం గ్రామ సమీపంలో బ్రిడ్జ్ వద్ద వరాహ నదిలో ట్యాంక్ నిర్మాణం పూర్తి చేశారు.అయితే

నాటుబళ్లపై యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా

స్థానిక ఇసుక బండ్లు యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ట్యాంక్ దిగువ భాగంలో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బ్రిడ్జ్, వాటర్ ట్యాంక్ వంటి కట్టడాల వద్ద ఇసుకను తొలగిస్తే ప్రమాదం చోటు చేసుకుంటుదని మైనింగ్, జలవనరుల శాఖ అధికారులు పలుమార్లు హెచ్చరించినా, ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ట్యాంక్ నిర్మించిన పరిసర ప్రాంతంలో ఇసుకును తరలించడం ప్రమాదమని కాంట్రాక్టర్ పలుమార్లు హెచ్చరించినా పట్టించు కోకుండా ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు చూసి,చూడనట్లు వ్యవరించడంతోనే ఇసుకాసురుల ఆగడాలు కొనసాగు తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్యాంక్ పరిసర ప్రాంతంలో ఇసుక తరలింపును నివారించిక పోతే రక్షిత పథకం ప్రారంభం కాకుండే ప్రమాదం జరిగే అవకాశం ఉంది...

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే చెడ్డపేరు

- గుంతల రోడ్డులో వైసిపి నేతల నిరసన

గోతుల రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - రావికమతం: కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి వల్ల ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి చెడ్డపేరు వస్తోందని వైసిపి మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు, ఎంపిపి పైల రాజు ఆక్షేపించారు. మంగళవారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై నుయ్యిలను తలపిస్తున్న గొయ్యిల వద్ద నించొని నిరసన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉండి కూడా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యవైఖరి వలన తాము ఇబ్బందులు ఎదుర్కోంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చోడవరం నియోజకవర్గం గంధవరం నుంచి రోలుగుంట వరకు రోడ్డు నిర్మాణానికి గత ఏడాదే ముఖ్యమంత్రి జగన్మోహన్ మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. కష్టపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీకి, ఇలాంటి నిర్వాకాల వల్ల చెడ్డపేరు వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లింపు

ప్రజాశక్తి-గొలుగొండ : పంచాయతీల్లో పనిచేస్తున్న 62 మంది పారిశుధ్య కార్మికులకు ఏడాది కాలానికి జీతాలు అందజేశామని ఇఒపిఆర్‌డి రఘురాం తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 62 మంది కార్మికులకు గత ఏడాది మార్చి నుంచి, ఈ ఏడాది మార్చి వరకు 12 నెలల జీతాలను ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.6వేల చొప్పున పంచాయతీల ద్వారా అందజేశామన్నారు. పారిశుధ్య కార్మికులకు రెండేళ్ల నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిలో స్వచ్ఛభారత్ ద్వారా 2021-22కాలానికి సంబంధించి 62 మంది కార్మికులకు వేతనాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ఆ నిధులు మంజూరైన వెంటనే కార్మికులకు చెల్లిస్తామన్నారు.

నేడు కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల : స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈనెల 3న బుధవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో, ఎంపిపి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ చంద్రశేఖర్ తెలిపారు, ఎంపిటిసి సభ్యులకు, సర్పంచులకు, అధికారులకు సమాచారం అందజేశామన్నారు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో మండల సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

4న ఎం.కోడూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి. -మాడుగుల : మండలంలోని ఎం.కోడూరులో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు. అనిల్ నీరుకొండ ఆసుపత్రి సౌజన్యంతో మోసూరి ఈశ్వరరావు ఆసుపత్రి వద్ద శిబిరం నిర్వహిస్తామని, జనరల్ వైద్యులతో పాటు, గైనిక్, అర్థోపెడిక్, ఇఎన్‌టి వైద్యనిపుణులు శిబిరంలో పాల్గొని రోగులకు వైద్యసేవలు అందిస్తారన్నారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూన్ 6న మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి-మాడుగుల : మాడుగుల ఇలవేల్పు ఆరాధ్య దైవం మోదకొండమ్మ పండగను జూన్ 6 వ తేదీన నిర్వహించేందుకు ముహూర్తం ఖరారైంది.ఈనెల 3న బుధవారం అమ్మవారి శతకంపట్టు వద్ద రాట వేసేందుకు, 7న పండగ చాటింపు, 9న శతకం పట్టు వద్ద కొలువు ఏర్పాటు నిర్వహించి, వచ్చేనెల్ 6 వ తేదీన ప్రధాన పండగ నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయం తీసుకుంది.

రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు

ప్రజాశక్తి -కోటవురట్ల: వైఎస్ఆర్ సేవా పథకం ద్వారా మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో రైతులకు 40శాతం సబ్సిడీతో వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. కోటవురట్ల ఆర్సిపాలెం గ్రామాలకు ట్రాక్టర్‌తో పాటు రోటావీటర్, అందజేయగా గొట్టువాడ, పి కొత్తపల్లి గ్రామానికి చాప్ కట్టర్, కొడవటిపూటి గ్రామానికి బ్రష్ కట్టర్, కె.వెంకటాపురం గ్రామానికి రెండు స్ప్రేయర్లు, జల్లూరు గ్రామానికి ట్రాక్టర్ డిస్కవీల్స్ అందజేశారు, ఆయా గ్రామాలకు చెందిన నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు వీటిని అందజేసినట్లు తెలిపారు.

రైతులకు ట్రాక్టర్లు అందజేస్తున్న అధికారులు

డిపోలకు పూర్తిస్థాయిలో చేరని రేషన్ సరుకులు

డిపోలకు రేషన్ బియ్యం తరలిస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలోని మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు సంబంధించి స్టాక్ పాయింట్ నుండి నేటికీ రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో డిపోలకు చేరుకోక పోవడంతో డీలర్లు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు, ఇరు మండలాలకు సంబంధించి 500 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని డిపోకు సరఫరా చేయాల్సి ఉండగా, ఇంతవరకు 400 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే డిపోలకు సరఫరా చేశారు. 86 డిపోలకుగాను 70డిపోలకు సరుకులు సరఫరా చేసినట్లు గోదాము ఇన్‌ఛార్జి ఈశ్వరరావు తెలిపారు, స్టాక్‌పాయింట్ నుంచి మాకవరపాలెంలో 48, కోటవురట్లలో 38 రేషన్ దుకాణాలకు సరుకులు సరఫరా చేస్తారు. ఈనెల సరుకులు రావడం ఆలస్యం కారణంగా బట్వాడా చేయలేకపోయినట్లు తెలిపారు. మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో సరుకులు సరఫరా చేస్తామన్నారు,

మొక్కల సంరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - రావికమతం : పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా మండలంలోని కవగుంట గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించే చర్యలు సర్పంచ్ దాసరి కుమారి వరహాలు ఆధ్వర్యంలో చేపట్టారు. రావికమతం నుంచి కింతలికి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డులో కవగుంట రెవెన్యూ పరిధిలోగల సుమారు 1500 మీటర్లు పొడవునా 600 మొక్కలను నాటామన్నారు. వీటిలో కొన్ని ఔషధ మొక్కలు కూడా ఉన్నాయన్నారు. నాటిన మొక్కలను అలాగే గాలికి వదిలేయకుండా పంచాయతీ ఆధ్వర్యంలో సంరక్షణ చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ కుమారి వెల్లడించారు. .ఈ మొక్కలు ఏపుగాపెరిగితే ఈ రోడ్డు మార్గం గుండా వెళ్లే కింతలి, పొంగలిపాక, శివరాంపురం, కవగుంట, బుడ్డి బందా, జగన్నాధపురం, అగ్రహారం, కొమిరా, చిన్నపాచిల, గుమ్మాలపాడు, జేడిపేట, వమ్మలి తదితర గ్రామాల ప్రజలకు నీడను చల్లదనాన్ని ఇస్తాయన్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, పచ్చదనం కల్పనకు నిరంతరం చర్యలు చేపడుతున్నామన్నారు.

విద్యార్థి విభాగం బలోపేతానికి సూచనలు

ప్రజాశక్తి - నక్కపల్లి : విజయవాడలో మాజీ మంత్రి పేర్ని నానిని మంగళవారం కలిసినట్లు వైసిపి విద్యార్థి విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు తెలిపారు. రాబోయే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్టూడెంట్ వింగ్‌పై ఉందని , బాధ్యతగా పనిచేయాలని మాజీ మంత్రి సూచించినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బాబూరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సాహవంతులైన యువకులతో కమిటీలు ఏర్పాటుచేసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారుఉపమాక వెంకన్న ఆలయానికి రావలసిందిగా మాజీ మంత్రి నానిని కోరినట్లు తెలిపారు .

తాండవ రోడ్డు మరమ్మతులు చేయకుంటే
ఆర్అండ్‌బి డిఇఇ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నాతవరం తాండవ రోడ్డుకు పక్షం రోజుల్లో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని, లేకపోతే ఆర్అండ్‌బి డిఇఇ కార్యాలయాన్ని ముట్టడిస్తామని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీరసూర్యచంద్ర హెచ్చరించారు. మంగళవారం నర్సీపట్నంలో మాట్లాడుతూ నాలుగేళ్లుగా నాతవరం, తాండవ రహదారిని కనీసం పట్టించుకోక, నిర్వహణ పనులైనా చేపట్టేందుకు ఎమ్మెల్యే గణేష్ చొరవచూపకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు జనసేన తరపున పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు, గోతులు పూడ్చడం వంటి కార్యక్రమాలు చేసినా స్పందన లేదన్నారు. ఆందోళన చేస్తామంటే పోలీసులు అడ్డుపడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆర్అండ్‌బి డిఇఇ కార్యాలయం ముట్టడితోపాటు తాండవ రోడ్డువద్ద ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ 9వ వార్డ్ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, మాకవరపాలెం మండల నాయకులు నమ్మి రమణరాజు, పోలుపతి సూరిబాబు, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను అందజేసేదెన్నడో..?

సెల్ఫీ ఛాలెంజ్ చేసిన టిడిపి కౌన్సిలర్ రామరాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో ఇళ్లను ఎప్పటికి లబ్ధిదారులకు అందజేస్తారో చెప్పాలని టిడిపి కౌన్సిలర్ రామరాజు ప్రశ్నించారు. మంగళవారం టిడ్కో గృహ సముదాయం వద్ద సెల్ఫీ తీసుకొని వైసిపి నేతలకు చాలెంజ్ విసిరారు. 2019 చంద్రబాబు హయాంలో కట్టిన ఇళ్లను లబ్ధిదారులకు పంచేందుకు ముఖ్యమంత్రి జగన్‌కు నాలుగేళ్లయినా తీరిక లేదాయని స్థానిక ఎమ్మెల్యే గణేష్‌ను ప్రశ్నించారు. టిడిపి హయాంలో నిర్మించిన ఇళ్లకు వైసిపి రంగులు వేస్తే సరిపోదని, ఆయా గృహసముదాయాలకు రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ ఇతరత్రా మౌలిక సదుపాయాలన్నీ కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో రాజుపేట, లింగాపురం గ్రామాలలో మంగళవారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. రాజుపేట గ్రామంలో 9 మంది, లింగాపురం గ్రామంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి, కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బాధితులకు డాక్టర్ రాజ్యలక్ష్మి చికిత్సను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కుక్క కాటు కేసులు అధికంగా వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి సరైన సమయంలో చికిత్సను పొందాలన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో రాజుపేట గ్రామంలో మంగళవారం పరదేశమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి జరిగే పండగ కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం ఘటాల పండగ ఘనంగా నిర్వహించారు. నవర వీధి, చింతకింద వీధి ప్రజలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఘటాలను సమర్పించి, మొక్కుబడులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు..మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

పోస్టల్ యూనియన్ గుర్తింపు కొనసాగించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోస్టల్ డిపార్టుమెంట్‌లోని ఎన్ఎఫ్‌పిఇ, పి3 యూనియన్ల గుర్తింపును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. తప్పుడు ఫిర్యాదు ఆధారంగా బలమైన యూనియన్ల గుర్తింపును రద్దు చేయడం దుర్మార్గమని నాయకులు మండిపడ్డారు. గుర్తింపును కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సురేష్, పెంటయ్య, ఇళ్లపు రెడ్డి, శర్మ, మీనా కుమారి, రాధ, మంజుల, గోవిందరావు, నాగిరెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో తలపెట్టిన పలు రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జోన్-2 పరిధి 12వ వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. సాయిబాబా దేవాలయం నుంచి చినగదిలికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్డు మధ్య విభాగినిలను ఏర్పాటు చేయాలన్నారు.

పోలమాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శివాజీపాలెంలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు శ్రీ కృష్ణా సేవా సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు అమ్మవారి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, గ్రామ పెద్దలు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

టిడిపి నేతలపై అక్రమ కేసులు సరికాదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ పార్టీ నాయకులపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం సరికాదని, రానున్న ఎన్నికల్లో జగన్ సర్కారుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని టిడిపి రాష్ట్ర నాయకులు ఎమ్‌డి నజీర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అదిరెడ్డి భవానికి రాజమండ్రిలో ఎమ్మెల్యేగా మంచి పేరు ఉందని తెలిపారు. ఆమె కుటుంబంపై కక్ష సాధింపునకు పాల్పడుతూ అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. సమావేశంలో పార్టీ మైనార్టీ విభాగం నాయకులు షేక్ రామ్ తుల్లా అబ్దుల్, చిన్నా రహమాన్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్ విద్యార్థికి జాతీయ సాహిత్య పురస్కారం

పురస్కారాన్ని స్వీకరిస్తున్న పార్థసారధి అయ్యంగార్

ప్రజాశక్తి -పాయకరావుపేట : తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడచిన ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాలలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థి, యువకవి ఎయ్యుణ్ణి పార్థసారధి అయ్యంగార్‌కు జాతీయ సాహిత్య పురస్కారంతో పాటు కవిశ్రేష్ట బిరుదుతో ఘనంగా సత్కరించారు.ఉత్తమ కవితా రచన చేసిన పార్థసారధికి పద్మశ్రీ ప్రొఫెసర్ కె.ఇనాక్ జాతీయ సాహిత్య పురస్కారం, కవిశ్రేష్ఠ బిరుదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేసి, సత్కరించారు. పోటీలలో గెలుపొందడం ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించి, ప్రశంసా పత్రం అందుకున్నాడు. సాహిత్య ప్రతిభ చూపిన విద్యార్థి పార్థసారధి అయ్యంగార్‌ను విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. వీర్రాజు, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిషేధ సమయంలో చేపల వేట

అడ్డుకున్న దొండవాక మత్స్యకారులు
రూ.20 వేల జరిమానా విధించిన అధికారులు

చేపల తరలింపును అంటుకున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెద తీనార్ల పంచాయతీ శివారు దొండవాక సముద్రతీరంలో కొందరు చేపలు వేట చేసి, వ్యాన్ లో చేపలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ అర్జిల్లి శివాజీ తెలిపారు. నిషేధ సమయంలో చేపలు వేట చేయడంపై దొండవాక మత్స్యకారులు అడ్డుకొని, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ అర్జిల్లి శివాజీకి సమాచారం ఇచ్చారు ఆయన సముద్ర తీరానికి చేరుకుని చేపలు వేట చేసిన వారిని, తరలిస్తున్న వారిని అడ్డుకున్నారు .వేట నిషేధ సమయంలో చేపలు వేట ఎందుకు సాగిస్తున్నారని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో కొందరు మత్స్యకారులు సముద్రంలో వేట చేస్తూ, దొండవాక సముద్రతీరానికి చేరారని, చేపలను వ్యానులో తరలిస్తుండగా పట్టుకున్నారు. విషయాన్ని ఏడి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు వాహన దారునికి రూ.20 వేలు జరిమానా విధించా మన్నారు. వాళ్ల దగ్గర అంత నగదు లేకపోవడంతో వాహనానికి సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంటును స్వాధీనం చేసుకుని వాహనాన్ని విడిచిపెట్టినట్లు శివాజీ తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: మంత్రి అమర్

ప్రజాశక్తి- కశింకోట : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ దృష్టికి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితిని స్థానికులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన డ్రైనేజీల నిర్మాణానికి రూ.15 లక్షలు తక్షణం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా? లేదా? తెలుసుకోవడం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, దీని పట్ల నిర్లక్ష్యం సరికాదని హెచ్చరించారు. కార్యక్రమానికి గైర్హాజరైన డిప్యూటీ తహశీల్దారు, ఆర్ అండ్ బి అధికారులకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ్య నాయుడు, కరక రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హత పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి అమరనాథ్

పథకం ప్రకారమే రంగురాళ్ల దోపిడీ

వైసిపి నేతల కనుసన్నల్లో అక్రమాలు
అధికారుల పాత్రపై విచారణ చేయాలి
మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పథకం ప్రకారమే వైసిపి నేతలు రంగురాళ్ల దోపిడికి పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ డిఎఫ్ఒ, రేంజర్ కనుసన్నల్లోనే అటవీ కలప అక్రమ రవాణా, రంగురాళ్ల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. రంగురాళ్ల తవ్వకాలకు జరిగిన ప్రదేశానికి చుట్టూనే ఫారెస్ట్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లుఉన్నప్పటికీ అధికారులు ఎందుకు నమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ఐదు రోజుల క్రితం కలపను అక్రమంగా రవాణా చేస్తున్న సమయంలో రేంజర్ డబ్బులు తీసుకుని వదిలేశారని ఇదే కలపను తూర్పుగోదావరి తుని సమీపోలో అటవీ అధికారులు పట్టుకొని కేసు రాసినట్లు మీడియాలో చూశానన్నారు. సాలిక మల్లవరం రంగురాళ్ల క్వారీలో రాత్రికి రాత్రి రూ.15 కోట్ల విలువచేసే అటవీ సంపదను దోచేశారని, సంఘటన జరిగి పది రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారని నిలదీసారు. అక్రమ తవ్వకాలపై అవసరమైతే కోర్టుకు వెళ్లడానికి సిద్ధమేనన్నారు. డిఎఫ్ఒ రాజారావు, రేంజర్ లక్ష్మీనరస, ఎస్ఐ నారాయణరావు ఫోన్ కాల్ లిస్ట్ ఆధారంగా విచారణ చేస్తే అక్రమాలన్నీ వెలుగులోకి వస్తాయన్నారు

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

వైసిపి పీడ వదిలితేనే రాష్ట్ర పురోభివృద్ధి

ప్రజాశక్తి - రావికమతం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పట్టిన జగన్ అనే చీడపీడ తొలిగేంతవరకు రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యం కాదని చోడవరం నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. మంగళవారం మండలంలో చినపాచీల గ్రామంలో ఆదాడ వారి కల్లాల వద్ద ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ నేతృత్వంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగుతోందని దుయ్యబట్టారు. వైసిపి పాలనతో ప్రజలు చాలా విసుగు చెందుతున్నారన్నారు. రాష్ట్రానికి పట్టిన చీడను వదిలించుకోకపోతే రానున్న రోజుల్లో , ప్రజలు మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు రాజానకొండ నాయుడు, గ్రామ సర్పంచ్ కోమటి రామలక్ష్మి, ఉప సర్పంచ్ కోమటి శంకర్రావు, ఎంపీటీసీ సభ్యురాలు ముచ్చకర్ల భవాని, పాల సంఘం అధ్యక్షులు ఆదాడ రాజారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కోన పరదేశి నాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ విధానాల మూలంగా నిరుద్యోగ యువత, రైతులు, దళిత, గిరిజన వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, పివిజి.కుమార్ అన్నారు. మండలంలోని వారాడ సంతపాలెం, పోతనవలస గ్రామాల్లో మంగళవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు రొంగలి మహేష్, నాయకులు జూరెడ్డి రాము, లెక్కల మల్లేశ్వరరావు, బండారు నరసింహనాయుడు, వేచలపు సింహాద్రప్పుడు, పోతనవలస సర్పంచ్ చిరికి వెంకటరమణ, లెక్కల అప్పలనాయుడు, లెక్కల కన్నంనాయుడు, కసిరెడ్డి అప్పలనాయుడు, లెక్కల అవతారమూర్తి, బొడ్డు మల్లునాయుడు, వేచలాపు విష్ణుమూర్తి, నరేష్, బుల్లిబాబు, బుచ్చి నాయుడు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

ఘనంగా ఉద్యోగ విజయోత్సవం

జాబ్ లెటర్స్‌తో పాలిటెక్నికల్ విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు ఉద్యోగ విజయోత్సం జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ జీవి రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నర్సీపట్నం డిఎస్‌పి కె. ప్రవీణ్‌కుమార్, ఉప సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు బి.కల్యాణ్ పాల్గొన్నారు. పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎల్ఎస్.రావు హాజరయ్యారు. 33 మంది విద్యార్థులు ఉద్యోగ నియామక పత్రాలను డిఎస్‌పి ప్రవీణ్ కుమార్, సాంకేతిక విద్య ఉప సంచాలకులు కల్యాణ్ అందజేశారు. మరో 25 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగ విజయోత్సవంలో వీల్స్ ఇండియా లిమిటెడ్, ఎఫ్రోనిక్స్, సమీర్, పయనీర్ అల్యూమినియం సంస్థలు పాల్గొన్నాయి.శాఖాధిపతులు విక్టర్ పాల్, నరసింహం, టిపిఒలు శ్రీనివాసరావు, ఉమా లలిత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

సూచనలు చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వీరజ్యోతి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ కె .వీరజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు పిహెచ్‌సిలో ఒపి రికార్డును పరిశీలించి, డాక్టర్ ఎన్ వాసంతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు తర్వాత పిహెచ్‌సిలో ఆశాడే సందర్భంగా ఆశ కార్యకర్తల సమావేశానికి హాజరైన హెల్త్ సెక్రటరీలు, సిహెచ్ఒలకు కొన్ని సూచనలు చేశారు తల్లి బిడ్డల ఆరోగ్యం, వ్యాక్సినేషన్, తల్లి పిల్లల రిజిస్ట్రేషన్, ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు,గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాల వద్దకు అధిక రక్తపోటు, మధుమేహం, ఫిట్స్ థైరాయిడ్ గుండెజబ్బులు, పక్షవాతం రోగులందరినీ తీసుకొచ్చి డాక్టర్‌తో చెకప్ చేయించి, అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయాలని సూచించారు.

రనక్తహీనత స్పెషల్ ప్రోగ్రామ్ మిషన్ -12లో ముఖ్యంగా కొత్తగా నమోదైన గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి, రిపోర్టులు ఆన్‌లైన్‌లో పంపాలని హెల్త్ సెక్రటరీకు సూచించారు. కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి, పిహెచ్ఎన్ఎం రత్నసఖి, ఆరోగ్య విస్తరణ అధికారులు టి.నాగేశ్వరరావు బి సత్యనారాయణ హెల్త్ విజిటర్ సిహెచ్.రమణ పాల్గొన్నారు.